నమస్తే తెలంగాణ
మెదక్
I | హైదరాబాద్, ఆదివారం 10 నవంబర్ 2024 | MEDAK


కేసీఆర్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఉడెం కృష్ణారెడ్డి

కేసీఆర్‌కు ఆహ్వాన పత్రిక అందజేత

గజ్వేల్, నవంబర్ 9: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు గజ్వేల్ ఆత్మకమిటీ మాజీచైర్మన్ ఉడెం కృష్ణారెడ్డి తన కుమారుడి వివాహ ఆహ్వాన పత్రికను శనివారం ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో అందజేశారు. ఈనెల 14న జరగనున్న వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

కేసీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్ నాయకుడు


కేసీఆర్‌తో శ్రీనివాస్ కుటుంబ సభ్యులు

అక్కన్నపేట, నవంబర్ 9: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలోని రామవరం మాజీ ఎంపీటీసీ, బీఆర్ఎస్ యువ నాయకుడు లింగాల శ్రీనివాస్ కుటుంబ సమేతంగా మర్యాద పూర్వకంగా ఎర్రవల్లిలో కలిశారు. శ్రీనివాస్ కుమారుడు లింగాల సాయి మణికంఠ జన్మదినం సందర్భంగా కేసీఆర్ ఆశీర్వాదం తీసుకున్నారు. కేసీఆర్‌ను కలవడం సంతోషంగా ఉందని లింగాల శ్రీనివాస్ ఆనందం వ్యక్తం చేశారు.

ప్రశ్నించే వారిపై కాంగ్రెస్ సర్కారు దౌర్జన్యం

- ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై దాడి, అరెస్టు అమానుషం
- హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్

కరీంనగర్‌లోని అపోలో లీచ్‌లో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని పరామర్శిస్తున్న సతీశ్‌కుమార్

హుస్నాబాద్, నవంబర్ 9: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రశ్నించిన వారందరిపై కాంగ్రెస్ ప్రభుత్వం దౌర్జన్యానికి పాల్పడుతున్నదని, ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్‌కు, సీఎం రేవంత్‌రెడ్డికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ అన్నారు. శనివారం హుజూరాబాద్‌లో రెండో విడత దళితబంధు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జరిగిన ధర్నాలో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేయడం అమానుషమన్నారు. ధర్నాలో జరిగిన తొక్కిసలాటలో గాయాల పాలై దవాఖానలోచికిత్స పొందుతున్న కౌశిక్‌రెడ్డిని శనివారం సాయంత్రం కరీంనగర్‌లోని అపోలో దవాఖానలో పరామర్శించారు. ఈ సందర్భంగా మీడియాకు ప్రకటన విడుదల చేశారు. హామీలపై బాండ్లు రాసిచ్చి, ఆలయాల్లో ప్రమాణాలు చేసిన కాంగ్రెస్ నాయకులు అధికారంలోకి వచ్చాక వాటిని పూర్తిగా విస్మరించారని విమర్శించారు. దళితబంధు గతంలో ఇచ్చినదానికంటే ఎక్కువ ఇస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి ఆ విషయాన్ని పక్కనపెట్టారన్నారు. అధికారంలోకి వచ్చిన వరకు అలవికాని హామీలిచ్చి, ప్రలోభపెట్టి ఓట్లు దండుకున్న కాంగ్రెస్ నాయకులు, అనంతరం ప్రజలనోట్లో మట్టికొడుతూ సొంత ప్రయోజనాల కోసమే పనిచేస్తున్నారని ఆరోపించారు. కౌశిక్‌రెడ్డితోపాటు దళితులపై చేసిన దాడి అమానుషమన్నారు. అరెస్టు చేసిన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని వెంటనే విడుదల చేయాలని, దళితులకు ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

సంక్షేమ ఫలాలు అందించేందుకే సర్వే

- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క

వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్లు

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 9: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించేందుకే సర్వే చేపడుతున్నామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ప్రణాళిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ సుల్తానియాలతో కలిసి ఆయన కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ..సర్వేపై ప్రజలు ఎలాంటి అనుమానాలకు గురి కావాల్సిన అవసరం లేదన్నారు. నిరంతం క్షేత్రస్థాయిలో పర్యటించాలని కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు.

ప్రభుత్వ సూచనల మేరకే...

సమగ్ర కుటుంబ సర్వేలో ప్రభుత్వ సూచనల మేరకే వివరాలు సేకరించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి స్పష్టం చేశారు. సంగారెడ్డిలోని 22వ వార్డులో వివరాలు సేకరించి సర్వేను ప్రారంభించారు. అనంతరం కొత్తాపూర్‌లో సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

మెదక్ జిల్లా కొల్చారం రైతుదీక్షలో మాజీమంత్రి హరీశ్‌రావును వరికంకులతో సన్మానిస్తున్న రైతులు, నాయకులు

కాంగ్రెస్ మెడలు వంచుతాం

- ఉద్యమ రోజులు గుర్తొస్తున్నాయి..
- రైతు దీక్ష ఏర్పాటు చేసిన సునీతమ్మకు ధన్యవాదాలు
- రైతులు అడుగడుగునా కాంగ్రెసోళ్లను నిలదీయాలి
- ప్రభుత్వ బోగస్ మాటలకు కాంగ్రెస్ కార్యకర్తలే సిగ్గు పడుతుండ్రు..
- రుణమాఫీపై ఒట్లు పెట్టి దేవుండ్లను కూడా మోసం చేసిన రేవంత్
- రేవంత్‌కు దమ్ముంటే నల్లగొండలో కాదు.. హైదరాబాద్ మూసీ పరిసరాల్లో పర్యటించాలి
- మూసీ మురికిని తెచ్చిందే చంద్రబాబు, కాంగ్రెస్
- మూసీ ప్రక్షాళనకు ప్రణాళికలు సిద్ధం చేసింది కేసీఆర్
- మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు
- మెదక్ జిల్లా కొల్చారంలో విజయవంతమైన బీఆర్ఎస్ రైతు దీక్ష

కొల్చారం, నవంబర్ 9: కాంగ్రెస్ మెడలు వంచడానికే రైతు దీక్ష చేపట్టామని, ఈ రైతు దీక్ష చూస్తుంటే ఉద్యమ రోజులు గుర్తుకొస్తున్నాయని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శనివారం మెదక్ జిల్లా కొల్చారంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ చేపట్టిన రైతు దీక్షకు విజయవంతమైంది. కార్యక్రమానికి మాజీమంత్రి హరీశ్‌రావుతోపాటు ఎమ్మెల్సీలు శేరి సుభాష్ రెడ్డి, వెంకట్రామ్ రెడ్డి, యాదవ రెడ్డి, దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్ రెడ్డి, కొత్త ప్రభాకర్ రెడ్డి మాణిక్ రావు, బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు క్రాంతి కిరణ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ..ప్రభుత్వ వైఫల్యాలను దుయ్యబట్టారు. రైతుదీక్ష ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే సునీతమ్మకు ధన్యవాదాలు తెలిపారు. అడగకముందే బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతుబంధు, రైతుబీమా పథకాలు పెట్టామన్నారు. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, ఉచిత కరెంటు వంటి పథకాలతో రైతు శ్రేయస్సుకు తోడ్పడ్డామని చెప్పారు. నీటి తీరువా, భూమిశిస్తూ రద్దు చేశామన్నారు. రేవంత్ బూతుల సీఎం అని, మూసీ కంపు కంటే రేవంత్ మూతికి కంపు ఎక్కువ అన్నారు. పిల్లి శాపనార్థాలకు ఉట్టి ఊసి పడదని, రేవంత్ తిట్లకు బీఆర్ఎస్‌కు నష్టం లేదన్నారు. బూటకపు హామీలతో రైతులను వంచించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు రోడ్లపాలు, గురుకులాలు దవాఖానపాలు, కానిస్టేబుళ్లు ఉద్యమాలు చేస్తున్నారన్నారు. ఎన్నికలకు ముందు బాండ్ పేపర్ ఇచ్చి దాని విలువ లేకుండా చేశారని, దేవుండ్ల మీద ఒట్టు పెట్టి దేవుండ్లను కూడా మోసం చేసిన ఘనత రేవంత్‌రెడ్డిదేనని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం రుణమాఫీని వాయిదాల మీద వాయిదాలు వేస్తుందన్నారు. ప్రభుత్వం కొనుగోలు చేయలేక ధాన్యం దళారుల పాలవుతుందన్నారు. రూ.2300 అమ్మాల్సిన ధాన్యాన్ని రైతులు 17, 18 వందలకే అమ్ముకుంటూ నష్టపోతున్నారని చెప్పారు. కాంగ్రెస్ కార్యకర్తలు పార్టీ పేరు చెప్పుకునేటందుకు సిగ్గు పడుతున్నారన్నారు. గణపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త సిద్దిరాములుపై వచ్చిన వార్తా కథనాలను చూశానన్నారు.

మెదక్ జిల్లా కొల్చారం రైతుదీక్షలో మాట్లాడుతున్న మాజీమంత్రి హరీశ్‌రావు పక్కన ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు

కల్లాల్లోనే కాలం గడుపుతున్న రైతులు

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నిలువునా ముంచింది. ఆరుగాలం కష్టించి పండించిన పంటను కొనడానికి ప్రభుత్వానికి చేతనయిత లేదు రైతులు పండించిన పంటతో కల్లాల్లోనే కాలం గడుపుతున్నారు. బీఆర్ఎస్ ధర్నాలు చేపడతామని హెచ్చరిస్తే ఎట్టకేలకు కొనుగోళ్లు ప్రారంభించారు. క్వింటాల్‌కు ఇస్తామన్న బోనస్ అంతా బోగస్. బేషరతుగా అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలి. అటు పత్తి, చెరుకు రైతులను సైతం ప్రభుత్వం మోసం చేసింది. బీఆర్ఎస్ పదేండ్లలో ఉచిత కరెంటు, సాగునీరు, తాగునీరు వంటి ప్రజోపయోగ పథకాలు ప్రవేశపెట్టింది.

– సునీతాలక్ష్మా రెడ్డి, ఎమ్మెల్యే

కేసీఆర్ అంటే వికాసం రేవంత్ అంటే విధ్వంసం...

రేవంత్ ప్రభుత్వానికి ప్రజలపై గానీ, పాలనపైగాని శ్రద్ధ లేదు. ఢిల్లీకి బ్యాగులు మోయడానికే సరిపోతుంది. స్వపక్ష నాయకులు ఎప్పుడు తనను కుర్చీ దించుతారోనని భయపడుతున్నారు. ఆనాడు చంద్రబాబుకు తొత్తులాగా పనిచేశారు. ఒకవైపు ఉవ్వెత్తున ఉద్యమం సాగుతుంటే చంద్రబాబు నల్లగొండకి వస్తానంటే రానీయకుండా ఆపడానికి యత్నించిన జేఏసీ నాయకులను తుపాకీతో కాలుస్తానన్న ఉద్యమద్రోహి రేవంత్. ఇప్పటికీ జయశంకర్ సార్ పేరు పలకలేదు. తెలంగాణ కోసం అంకితభావంతో పనిచేసిన నాయకులు కేసీఆర్, హరీశ్‌రావు. రేవంత్ అంటే విధ్వంసం, కేసీఆర్ అంటే వికాసం.

– దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్సీ

తెలంగాణను కేసీఆర్ మొదటి స్థానంలో నిలబెట్టారు..

65 ఏండ్ల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలనలో తెలంగాణ పూర్తిగా వెనుకబడింది. 14 ఏండ్లు పోరాటం తర్వాత 29 రాష్ట్రంగా తెలంగాణ అవతరించింది. ఆర్థికంగా వెనుకబడిన తెలంగాణను కేసీఆర్ మొదటి స్థానంలో నిలబెట్టారు. ఇప్పుడు కాంగ్రెస్ రైతులతో పాటు అన్ని వర్గాలనూ కష్టపెడుతున్నది. ధాన్యం తూకంలో అలసత్వం చేస్తున్నది. మండలానికి ఒక్కటే రైస్‌మిల్ కేటాయిస్తే ధాన్యం కొనుగోళ్లు ఎప్పటికీ పూర్తవ్వవు.

– శేరి సుభాష్ రెడ్డి, ఎమ్మెల్సీ

రాష్ట్రాన్ని రోడ్డున పడేశారు...

గొడ్డెడ్చిన పొలం, రైతు ఎడ్చిన రాజ్యం ఎప్పటికీ బాగుపడదు. ఈ రైతుదీక్ష తెలంగాణలో మలిదశ ఉద్యమానికి పునాది. చావునోట్లో తలపెట్టి తెలంగాణ తెచ్చుకున్నాం. కేసీఆర్ ఆరు నెలల్లో విద్యుత్ రంగాన్ని పటిష్టం చేసి రైతుల కండ్లల్లో సంతోషం నింపారు. ఇప్పుడు రేవంత్ 11 నెలల్లో రాష్ట్రాన్ని రోడ్డున పడేశారు. సన్న వడ్లపై పంట పెట్టేటప్పుడు లేని నిబంధన ఇప్పుడు ఎందుకు, బంగారం జోకి నట్లు వడ్లను మిషిన్ల పెట్టి కొల్పుడేంది. మెదక్ జిల్లాకు వచ్చిన మంత్రులు ప్రజలు ఎక్కడ ప్రశ్నిస్తారో అని కొబ్బరికాయ కొట్టక ముందే పారిపోతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల ఉసురు తగలక తప్పదు. అన్నిరకాల వడ్లకు బోనస్ ఇవ్వాలి, ప్రతి గింజా కొనుగోలు చేయాలి.

– పద్మాదేవేందర్ రెడ్డి, మాజీఎమ్మెల్యే

కొల్చారం రైతుదీక్షకు భారీగా తరలివచ్చిన రైతులు

కుటుంబ సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

- సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి

కొండపాక(కుకునూరుపల్లి), నవంబర్ 9: కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి అన్నారు. శనివారం కొండపాక మండలంలోని దుద్దెడలో కుటుంబసర్వేను పరిశీలించడంతోపాటు మొదటి రోజు వివరాల సేకరణలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఎన్యూమరేటర్లను అడిగి తెలుసుకున్నారు. ఇబ్బందులు ఉంటే సూపర్‌వైజర్ల దృష్టికి తీసుకురావాలన్నారు. సర్వే వల్ల ప్రభుత్వ పథకాలు మరింత మందికి అందించడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవోలు సదానందం, చంద్రకళ, మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్, కొండపాక,ములుగు తహసీల్దార్లు దిలీప్‌నాయక్, ప్రవీణ్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

దుద్దెడలో ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి

ఉద్యమాల గడ్డ సిద్దిపేట

- మా డీఎన్ఏలోనే పౌరుషం
- వ్యక్తిగత విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకోం
- దమ్ముంటే సిద్దిపేటకు నిధులు తీసుకురండి
- సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకుల ప్రెస్ మీట్

సిద్దిపేట అర్బన్, నవంబర్ 9: ఉద్యమాల గడ్డ సిద్దిపేట. మా డీఎన్ఏలోనే పౌరుషం ఉందని, వ్యక్తిగత విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కడవేర్గు రాజనర్సు, మాజీ ఏఎంసీ చైర్మన్ పాల సాయిరాం, బీఆర్ఎస్ నేత పూజల వెంకటేశ్వరరావు(చిన్నా), కౌన్సిలర్ బ్రహ్మం కాంగ్రెస్ నేత మైనంపల్లి హన్మంతరావును హెచ్చరించారు. శనివారం సిద్దిపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ..మాజీమంత్రి హరీశ్‌రావుపై, బీఆర్ఎస్ నాయకులపై మైనంపల్లి హన్మంతరావు వ్యక్తిగతంగా మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండించారు. సిద్దిపేట పౌరుషాల గడ్డ అని.. తామంతా ఉద్యమంలో కొట్లాడిన వాళ్లమని, ఇక్కడికి వచ్చి అవాకులు చెవాకులు పేలితే సహించబోమన్నారు. శాంతి యుతంగా ఉన్న సిద్దిపేట ప్రశాంతతను చెడగొడితే బాగుండదన్నారు. మీరు చేసే కార్యక్రమాలను ఎవరూ పట్టించుకోవడం లేదన్న అక్కసుతో ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారన్నారు. కాంగ్రెస్ అధిష్టానం తనను గుర్తించకపోతే సిద్దిపేటకు వచ్చి ప్రెస్‌మీట్లు పెడుతున్నారని ఎద్దేవా చేశారు. సిద్దిపేట ప్రజలు ఓట్లు వేసి గెలిపించిన హరీశ్‌రావు ప్రజలకు ఏ విధంగా సేవ చేయాలని మాత్రమే ఆలోచిస్తున్నారన్నారు. గతంలో నగర బహిష్కరణ గురై పక్క నియోజకవర్గంలో ఓడిపోయిన ఎమ్మెల్యే సిద్దిపేటకు వస్తే తమకేమీ సంబంధం లేదన్నారు. ప్రజాస్వామ్యంలో దమ్ము అనేది ఎన్నికల్లో గెలిచి.. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో ఉంటుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తీసుకుపోయిన వెటర్నరీ కళాశాల, ఈపీఎఫ్ కార్యాలయాన్ని తిరిగి తీసుకురావడంలో, శిల్పారామం నిధులు తీసుకురావడంలో మీ దమ్ము చూపిస్తే బాగుంటుందన్నారు. తాము నిర్మాణాత్మక ఆలోచనతో మాత్రమే ఉన్నామని.. ప్రజల సమస్యలు తీర్చడంలో మీ చొరవ చూపిస్తే బాగుంటుందన్నారు. ఇవన్నీ కాకుండా ప్రజల చేత గెలిచిన ఎమ్మెల్యేను వ్యక్తిగత విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకోబోమన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు అరవిందర్‌రెడ్డి, నాగరాజు, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్, ఆంజనేయులు, కనకరాజు, ఉమేశ్, ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఐఐటీహెచ్‌లో జాతీయ సదస్సు ప్రారంభం

- ఆకట్టుకున్న స్టాల్స్

ఐఐటీ హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను తిలకిస్తున్న కేంద్ర విద్యాశాఖ కార్యదర్శి సంజయ్‌మూర్తి, ఐఐటీ డైరెక్టర్ బీఎస్ మూర్తి తదితరులు

సంగారెడ్డి,నవంబర్ 9(నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీ హైదరాబాద్‌లో 'విద్యార్థుల్లో మానసిక ఆరోగ్యం' అనే అంశంపై రెండురోజుల జరిగే జాతీయస్థాయి సదస్సును శనివారం కేంద్ర విద్యాశాఖ కార్యదర్శి సంజయ్‌మూర్తి ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో కొనసాగుతున్న 100 ఉన్నత, సాంకేతిక విద్యాసంస్థలకు చెందిన ప్రతినిధులు సదస్సులో పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు మానసిక ఒత్తిడి నుంచి దూరం చేసేందుకు విద్యాసంస్థల్లో ప్రత్యేక సెల్స్‌ను ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ బీఎస్ మూర్తి మాట్లాడుతూ..ఐఐటీ హైదరాబాద్‌లో జాతీయస్థాయి నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. సీనియర్ సైకాలజిస్టు నాగ్‌పాల్ మాట్లాడుతూ..ఉన్నత విద్యాసంస్థల్లో చదివే విద్యార్థుల మానసిక ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సూచనలు చేశారు. కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శి అనంత్ నాగేశ్వర్ ఆన్‌లైన్‌లో సదస్సులోని విద్యార్థులు, ప్రొఫెసర్లను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సదస్సులో ఐఐటీలతో పాటు 50 ఉన్నత విద్యా సంస్థలు ఏర్పాటు చేసిన స్టాల్స్ ఆకట్టుకున్నాయి. కేంద్ర విద్యాశాఖ కార్యదర్శి సంజయ్‌మూర్తి, ఐఐటీ డైరెక్టర్ బీఎస్‌మూర్తి, ప్రొఫెసర్లు, సైకాలజిస్టులు స్టాల్స్‌ను తిలకించారు. ప్రతి విద్యాసంస్థ నుంచి ఇద్దరు ప్రొఫెసర్లు, విద్యార్థులు స్టాల్స్‌లో పాల్గొని ప్రజంటేషన్ ఇచ్చారు. ఐఐటీ హైదరాబాద్‌కు చెందిన సన్‌షైన్ స్టాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సన్‌షైన్ టీమ్ విద్యార్థులు వర్షిణి, సాయికుమార్, రిషికుమార్ ఐఐటీ విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి తగ్గించేందుకు తీసుకుంటున్న చర్యలను సందర్శకులకు వివరించారు. మానసిక వత్తిడికి గురయ్యే విద్యార్థులను గుర్తించేందుకు ఫ్రెండ్స్ బడ్డీలు, మెంటార్స్, కౌన్సిలర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే మానసిక వత్తిడి ఎదురయ్యే విద్యార్థులు సులువుగా కౌన్సిలింగ్ తీసుకునేందుకు వీలుగా ప్రత్యేకంగా యాప్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఐఐటీ భువనేశ్వర్‌కు చెందిన విద్యార్థులు అరవింద్, శ్రావ్య తమ సంస్థలో మానసిక ఆరోగ్యం కోసం ఏర్పాటు చేసిన కౌన్సిలింగ్ సర్వీస్ టీమ్ గురించి సందర్శకులకు తెలియజేశారు. ఐఐటీ భువనేశ్వర్‌లో విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి తగ్గించేందుకు క్రమం తప్పకుండా క్రీడాపోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, పండుగలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఏర్పాటు చేసిన స్టాల్స్

రోడ్డు ప్రమాదంలో తల్లీకూతురు మృతి

బెజ్జంకి, నవంబర్ 9: నోముల కోసం తల్లిగారింటికి వస్తూ రోడ్డు ప్రమాదంలో తల్లీకూతురు మృతి చెందిన సంఘటన మండలంలోని బెజ్జంకి క్రాసింగ్ వద్ద రాజీవ్ రహదారిపై శనివారం చోటు చేసుకుంది. ఏఎస్ఐ శంకర్‌రావు కథనం ప్రకారం.. వేముల రాజ్‌కుమార్ కుటుంబంతో హైదరాబాద్‌లో స్థిరపడగా రాజ్‌కుమార్ భార్య వరలక్ష్మి, కుమార్తె అతిథి, వరలక్ష్మి తమ్ముడు ఉదయ్‌రామ్‌తో కలిసి హైదరాబాద్ నుంచి కారులో నోముల పండుగకు కరీంనగర్‌లోని ఆమె తల్లిగారింటికి బయలుదేరారు. బెజ్జంకి క్రాసింగ్ వద్ద రాజీవ్ రహదారిపై అతి వేగంగా కారు కల్వర్టును ఢీకొట్టడంతో వరలక్ష్మి ఆమె కుమార్తె అతిథి అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఉదయ్‌రామ్‌కు తీవ్ర గాయాలు కాగా అంబులెన్స్‌లో కరీంనగర్‌కు తరలించారు. మృతురాలి తండ్రి తిప్పారం వీరేశం ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ కేసు నమోదు చేయగా సీఐ శ్రీనివాస్ ఘటనా స్థలాన్ని పరిశీలించి, వివరాలు తెలుసుకున్నారు.

కుటుంబ వివరాలు మీకెందుకు చెప్పాలి?

- గ్రామగ్రామాన ప్రశ్నిస్తున్న ప్రజలు
- సమాధానాలు చెప్పలేక ఇబ్బందులు పడుతున్న ఎన్యూమరేటర్లు

హుస్నాబాద్ టౌన్, నవంబర్ 9: ప్రభుత్వం శనివారం నుంచి చేపట్టిన కులగణన సర్వేకు వెళ్లిన ఎన్యూమరేటర్లు ప్రజలు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక సతమతమవుతున్నారు. ఈ సర్వే ఎందుకు చెప్పాలంటూ పలువురు ప్రశ్నిస్తుండటంతో ఎన్యూమరేటర్లు ఇబ్బందులు తప్పడంలేదు. మీకు అభివృద్ధి పథకాలు కొత్తగా వస్తాయంటూ నమ్మబలికి వారినుంచి సమాధానాలు రాబడుతున్నారు. అసలు మాకు ఎందుకీతలనొప్పి అంటూ విధులు నిర్వర్తిస్తున్న ఎన్యూమరేటర్లు బాహాటంగానే అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. హుస్నాబాద్‌లో కులగణన సర్వే శనివారం ప్రారంభమైంది. సర్వేచేసే ఎన్యూమరేటర్లకు ప్రశ్నావళికి సంబంధించిన పుస్తకాలు ఆలస్యంగా అందాయి. పుస్తకాలు ఎప్పుడు వస్తాయో తెలియక కొందరు తీసుకునేందుకు సైతం రాకపోవడంతో కొన్ని వార్డుల్లోనే సర్వే ప్రారంభమైంది. సర్వేతీరును మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్ పరిశీలించి ఎన్యూమరేటర్లకు పలు సూచనలు చేశారు.

8వేలకు... స్టిక్కర్లు వేసింది 7వేలు

పట్టణంలో 8,610 కుటుంబాలు ఉంటాయని అధికారులు అంచనావేశారు. కానీ మూడు రోజులుగా పట్టణంలో కుటుంబాలను గుర్తించడానికి ఇంటింటా స్టిక్కర్లు వేశారు. ఇరువై వార్డుల్లో దాదాపు 7వేల కుటుంబాల ఇండ్లకు మాత్రమే స్టిక్కర్లు వేశారు.